క్లుప్తంగా

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ఎదులాపురం: ఉట్నూర్ మండల కేంద్రంలోని సెయింట్ పాల్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి కొట్టూరి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న అభినవ్ అనే విద్యార్థి హనుమాన్ మాల ధరించి వెళ్లగా రావద్దని పాఠశాల యాజమాన్యం చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొనసాగుతున్న శనగ కొనుగోళ్లు



మార్కెట్లో శనగ కొనుగోళ్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లో యాసంగిలో రైతులు పండించిన శనగ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇప్పటికి 1,188 మంది రైతుల నుంచి శుక్రవారం వరకు 20,518 క్వింటాళ్ల శనగలను కొనుగోళ్లు చేసినట్లు ఇచ్చోడ వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు.

శ్రీరామ శోభాయాత్ర విజయవంతం

ఆదిలాబాద్: శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీరామ శోభాయాత్ర విజయవంతమైనట్లు సమితి అధ్యక్షుడు రాళ్ళబండి మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. శోభాయాత్ర జయప్రదంగా సాగడానికి పోలీసు యంత్రాంగం ఎంతగానో సహకరించిందని, మీడియా, హిందూ బంధువుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు గంద్రత్ మహేందర్, సాయి, సురేందర్, మనోజ్ పవార్, అభియాదవ్, సూర్యకిరణ్ లాలా అర్జున్, సచిన్, చాణక్య, నిఖిల్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీపీ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు పాల్గొన్నారు. అనంతరం రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి కిషన్‌నాయక్

నార్నూర్: విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పశువులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా పశువైద్యాధికారి బాదవత్ కిషన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో గోపాలమిత్రలు ప్రైవేట్ మందులు రాయవద్దని సూచించారు. అత్యవసరంగా ఉంటే రైతుల ద్వారా తెప్పించుకోవాలన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి రమేశ్ రాథోడ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు ఎల్యాచి శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకట రమణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

బజార్‌హత్నూర్: బొలెరో మ్యాక్స్ పికప్ వాహనం దొంగతనం కేసులో నిందితుడు వాథోర్ సతీష్(25)కు శుక్రవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ మూడు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో నవంబర్ 6న మహ్మద్ షఫీకి చెందిన ఏపీ 21 టీఎక్స్ 0989 బొలెరో మ్యాక్స్ పికప్ వాహనాన్ని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని సిరంజని గ్రామానికి చెందిన వాథోర్ సతీశ్ దొంగతనం చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని అదుపులో తీసుకుని చార్జీషీట్ దాఖలు చేయగా బోథ్ కోర్టు శిక్ష విధించిందని తెలిపారు.

అప్రమత్తతే పంటకు రక్ష

- పొలాల్లో అగ్ని ప్రమాదాలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



అగ్ని ప్రమాదం కాలిపోయిన పైపులు (ఫైల్)



కాలిపోయిన పంట

సిరికొండ: రైతులు తమ పంట పొలంలోని పత్తి కర్రలు, పిచ్చి మొక్కలను తొలగించే క్రమంలో వాటికి నిప్పు పెడుతుంటారు. వేసవి కావడంతో మంటలు పక్క చేనులకు వ్యాపించి పైపులు, వ్యవసాయ పనిముట్లు, సామగ్రి, మోటార్లు కాలిపోతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పలుచోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు మాత్రం రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

యాసంగి సీజన్‌లో రైతులు జొన్న, మొక్కజొన్న, గోధుమ, వేరుశనగ పంటలు సాగు చేశారు. ముందస్తుగా పంట కోతకు వచ్చిన రైతులు యంత్రంతో కోసి పంటను ఇంటికి తరలిస్తారు. సకాలంలో కూలీలు, యంత్రాలు దొరకని రైతులు చేలల్లోనే పంటను నిల్వ చేస్తారు. ఈక్రమంలో కొందరు రైతులు వానాకాలంలో సీజన్ కోసం చేన్లను సిద్ధం చేసేందుకు చెత్తాచెదారం ఏరి కాల్చి వేస్తుంటారు. దీంతో పలుచోట్ల అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈసమయంలో రైతులు పక్క పొలానికి మంటలు వ్యాప్తించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పంటను కుప్పగా వేసి చుట్టూ పక్కల గడ్డి లేకుండా చూడాలి. పంట కర్రలు కాల్చివేయకుండా పొలంలోనే ఉంచి దున్నుకోవాలి. ఇలా చేయడం ద్వారా వర్మీకంపోస్టు ఎరువు తయారు అవుతుంది.

పంట బీమాతో మేలు..

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పంట బీమా చేసుకోవడమే మేలు. పంట బీమా చేసుకోవడం ద్వారా రైతు నష్టపోతే నష్ట పరిహారం వస్తుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులు అవగాహన కల్పించాలి.

ఇటీవల జరిగిన ఘటనలు..

- గతంలో మండల కేంద్రానికి చెందిన షేక్ అప్సర్ తన రెండు ఎకరాల వ్యవసాయంలో పొలంలో జొన్న పంట వేశాడు. పంట చేతికి వచ్చిన సమయంలో చెత్త కాల్చేందుకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు జొన్న పంటకు అంటుకొని దగ్ధమైంది.
- గత సంవత్సరం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మోరె తానాజీ తన ఎకరం పొలంలో జొన్న సాగు చేశాడు. చేనులో నుంచి విద్యుత్ తీగలు ఉన్నాయి. గాలులకు అంటుకొని మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. దీంతో ఎకరం పంట కాలిపోయింది.
- మండలంలోని కొండపూర్ గ్రామ శివారులో సిరికొండ గ్రామానికి చెందిన సాయిని స్వామి రైతు పొలంలో మొక్కజొన్న పంట వేశాడు. పంట ఎండిపోయి కోత దశకు వచ్చింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఎవరో చుట్ట కాల్చి పడేయడంతో గడ్డి కాలుకుంటూ.. వచ్చి పంట అంటుకుంది.

ఇలా అగ్ని ప్రమాదాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి పంటను కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మంటలు వ్యాపించాయి



గత ఏడాది మేలో మా చేనులో మొక్కజొన్న పంటకు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే చుట్టుప్రక్కల వారితో మంటలను ఆర్పి వేసి పంటను కాపాడుకున్నాం. లేదంటే పంట కాలిపోయి, ఆర్థికంగా నష్టపోయేవాళ్లం. –సాయిని స్వామి,రైతు సిరికొండ

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇంద్రవెల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జాదవ్ ప్రమీల అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ సెక్టర్ పరిధిలోని ఇన్కార్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాల్లో పిండి పదార్థం, ప్రోటీన్లు, క్యాల్షియం అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం పోషణ్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సీడీపీవో వనజ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పంజేషాకాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ రాజేశ్‌తో కలిసి గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, సంగీత, సంధ్యా, భూదేవి, రాజశ్రీ, మల్లికాంబ, విమల పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగల అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆదిలాబాద్ పట్టణ గౌరవ అధ్యక్షుడు అలల్ అజయ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వార్డు, గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు చేపట్టాలన్నారు. మాదిగల సమగ్ర కుటుంబ సర్వే, ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రాం, 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ చేపట్టాలన్నారు. అలాగే విద్య, న్యాయ, అభివృద్ధి, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జగిరి సంజయ్ కుమార్, ఈర్ల దయాకర్, నవీన్, నగేశ్, అన్నెల వసంత్, ఏవన్ పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని డాక్టర్ మాదస్తు శైలజ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆమె భర్త లక్ష్మన్న, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి బిపాషా, టెక్నీషియన్ నర్సారెడ్డి, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం

ఉట్నూర్: రాష్ట్రంలో విద్యాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని టీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు 12 నెలల వేతనాలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1100 సీఆర్టీలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వీ నాయకులు భీమన్న, బాబా శ్యాం, శేఖర్, క్రాంతి పాల్గొన్నారు.

విరాళం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కోట్టె రాంకిషన్ అనే వ్యక్తి రూ.1లక్ష అందజేశాడు. కార్యక్రమంలో సర్పంచ్ సదానంద్, ఆలయ కమిటీ సభ్యులు మహేందర్, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు పెద్దపీట

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ప్రజా ఆరోగ్య సంరక్షణను పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్‌ఐలు నారాయణ, గీత, తాక్రే గంభీర్, సతీష్‌పవార్, ఇంద్రశేఖర్, వరాడే విఠల్ పాల్గొన్నారు.

సదల్‌పూర్‌లో ఆత్మీయ సమ్మేళనం..

మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల పరిసరాల్లోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని, దీన్ని మరింత ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ప్రమోద్‌రెడ్డి, జక్కుల మధుకర్, వైద్య కిషన్, తన్వీర్ ఖాన్, వివేక్, కొడప అరుణ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ హక్కుల పరిరక్షణ కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ఏజెన్సీ హక్కుల పరిరక్షణ కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సలాం జంగు పటేల్, అధ్యక్షుడిగా కొడప సోనేరావు, ఉపాధ్యక్షుడిగా చందర్‌షావ్, మెస్రం మీనా, ప్రధాన కార్యదర్శిగా మెస్రం శంకర్, సహాయ కార్యదర్శిగా ఆర్క శేషరావు, ఆత్రం నాగుబాయి, కోశాధికారిగా మర్సుకోల కేశవ్, ప్రచార కార్యదర్శిగా వెట్టి దేవిదాస్, మడావి కమల బాయిలను ఎన్నుకున్నారు. గిరిజన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయడం లేదని ఆరోపించారు. సమావేశంలో కినక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా రేసోజి ప్రభాకర్ ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 25 మంది గుమస్తాలు ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి ప్రభాకర్, గణేష్ రెడ్డిలు పోటీపడగా.. ప్రభాకర్ ఒక ఓటు తేడాతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు అరుగుల అశోక్, వినోద్ రెడ్డిలు తెలిపారు. పూర్తి కార్యవర్గాన్ని సోమవారం ప్రకటిస్తామన్నారు.

వారసంతకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు శుక్రవారం సర్పంచ్ గాంధారి అధ్యక్షన వేలం నిర్వహించారు. ఇందులో 11 మంది వ్యాపారులు పాల్గొగా.. రూ. 12 లక్షల 55 వేలకు చహకటి మానిక్‌రావ్ దక్కించారు. ఈసందర్భంగా ఎంపీవో సంతోశ్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు మార్కెట్‌లో విక్రయదారుల నుంచి రవాణా దిగుమతుల కోసం వచ్చే వారి నుంచి రుసుము వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తహరే గణేష్, ఈవో సంజీవ్‌రావ్, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతకు వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన రాంకిషన్ రూ,1.30 వేలకు దక్కించుకున్నాడు. సర్పంచ్ ఓరగంటి నర్మాదా, ఎంపీవో హతుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం

నార్నూర్: మండల కేంద్రంలోని అంగడి బజార్ తైబజార్ వేలంను శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో స్వప్నశీల సమక్షంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన అడే విజయ్‌సింగ్ రూ. 2.60 లక్షలు వేలం పాట తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, రాథోడ్ సీకేందర్, రాథోడ్ ఉత్తం, దాదే అలీ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. సీసీరోడ్డుపై పెంట కుప్ప



ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో శ్మశాన వాటికకు వెళ్లే సీసీరోడ్డుపై పెంట కుప్ప వేశారు. దీంతో పరిసరా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. సంబంధిత అధికారులు స్పదించి పెంట కుప్ప తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: రమేశ్, ఎంపీవో, ఫోన్: 70933 50722

దారి ఇవ్వాలని రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

నేరడిగొండ: పంట పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలంటూ మండలంలోని చించోలి రైతులు శుక్రవారం నిరసన చేపట్టారు. నేరడిగొండ మండలం బోథ్ ఎక్స్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న అర్బన్ పార్క్ నుంచి తమ పంట పొలాలకు ఎలా వెళ్లాలని ఆందోళన చేపట్టారు. దారిని మూసివేసేందుకు ప్రయత్నం చేస్తున్న అధికారులను రైతులు అడ్డుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం అర్బన్‌పార్కు నిర్మాణం చేపట్టగా.. పొలాలకు వెళ్లే దారి మూసివేశారని పేర్కొన్నారు. వెంటనే అర్బన్‌పార్కు నుంచి దారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోథ్ ఎఫ్‌ఆర్‌వో ప్రణయ్, నేరడిగొండ ఎఫ్‌ఆర్‌వో గణేశ్, ఎస్సై సాయన్నలు చేరుకొని రైతులను సముదాయించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు



పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్

ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని చాందా (టి) గ్రామానికి చెందిన పోలీస్ అధికారి, నిజామాబాద్ డీఎస్పీ ఆరె వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులకు ఉగ్గే సంతోశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉగ్గే ఫౌండేషన్ అధ్యక్షుడు ఉగ్గే దత్తు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, బొజ్జ ఆడేల్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు రాయాలని లాలా రాధేశ్యాం వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు అభిలాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిక్కు, సొసైటి అధ్యక్షుడు అర్జున్, లాలామున్న, అక్షయ్, ప్రేమ్‌కుమార్, కైలాస్, హేమంత్, నరేందర్, నయన్ పాల్గొన్నారు.

బోథ్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు ఆధర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కిషన్, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షులు దుబ్బుల చంద్రశేఖర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సరస్వతీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ కుడ్మెత రత్నప్రభ సంతోశ్, సర్పంచ్ పెండెపు కృష్ణయాదవ్, హెచ్‌ఎం రాజశేఖర్, హెచ్‌డబ్ల్యూవో దేవరావ్, ఉపాధ్యాయులు రత్నం, సంటెన్న, రవి, పాల్గొన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మంగల్ సింగ్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, ప్రతాప్ నాయక్, చంద్రాసింగ్, రాంచంద్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

బజార్‌హత్నూర్: మన పూర్వీకులు అందించిన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండలంలోని మంజరంతండాలో మధుర సమాజం సాంప్రదాయంలో భాగంగా గోతి రమేశ్ కుమారులకు నిర్వహించిన వడక లగ్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణాలో అన్ని కుల మతాల సంస్కృతి సంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం, సర్పంచ్ చందర్ సింగ్, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు నిస్తే కైలాస్, నర్సారెడ్డి, గవ్వల సాయి, చైతన్య, కుర్మే లక్ష్మణ్, కొడారి నరేశ్ పాల్గొన్నారు.

33శాతం నిబంధన తొలగించాలి

- నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలి
- పొచ్చర క్రాస్ వద్ద రైతుల ఆందోళన

బోథ్: దెబ్బతిన్న పంటల సర్వేలో 33 శాతం నిబంధన ఎత్తివేయాలని, ప్రతీ గింజను సర్వేలో లెక్కించి నష్టపరిహారం అందించాలని మండల రైతులు శుక్రవారం పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. సర్వేలో ప్రభుత్వం నిబంధనలను ఎత్తివేయాలన్నారు. పంటలు దెబ్బతిన్న ఎందుకు సర్వేలో నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంటను సైతం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ధర్నాకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి మద్దతు తెలిపి, రోడ్డుపై బైఠాయించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వచ్చి రైతులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.